క్లుప్తంగా

కల్వర్టుకు మరమ్మతులు



మరమ్మతులు చేసిన కల్వర్టు

సాక్షి ఎఫెక్ట్..

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌కు వెళ్లే దారిలో పెద్ద పాట్నాపూర్ సమీపంలో ఉన్న రోడ్డు కల్వర్టు ప్రమాదకరంగా మారి రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సాక్షిలో ప్రయాణం.. ప్రమాదకరం శీర్షికన వార్త ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. శుక్రవారం ట్రాక్టర్‌తో కల్వర్టు ఇరువైపులా మొరం పోసి మరమ్మతులు చేపట్టారు.

'స్వచ్ఛతాహీ సేవా'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్

దహెగాం: మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక భద్రత పథకాలు, ప్రధానమంత్రి సురక్షబీమా యోజన, అటల్ పెన్షన్ యోజన నగదు రహిత లావాదేవీలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లి సన్నిధిలో దసరా ఉత్సవం



పోచమ్మకు పూజలు చేస్తున్న ఆదివాసీలు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్ గ్రామంలోని ఆదివాసీ మ్యూజియం సమీపంలో పోచమ్మతల్లి ఆలయంలో జోడేఘాట్ కొలాంగూడ గ్రామానికి చెందిన ఆదివాసీలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లి సన్నిధిలో దసరా ఉత్సవం జరుపుకున్నారు. పప్పు, బెల్లం, పుట్నాలు, సాంప్రదాయ వంటకాలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. ప్రతీ సంవత్సరం భీం వర్ధంతికి ఒక రోజు ముందు దసరా జరపడం ఆనవాయితీగా వస్తుందని దేవారీలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్రం భీం, లచ్చు, దేవ్‌రావు, కొద్దు, భీం తదితరులు ఉన్నారు.

క్రైస్తవుల ఆర్థికాభివృద్ధి కోసం కార్పొరేషన్

కాగజ్‌నగర్‌టౌన్: క్రైస్తవుల ఆర్థికాభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డి.రాజేశ్వర్ రావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనేక రకాల సమస్యలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. అనంతరం రాష్ట్ర చైర్మన్‌ను క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘం ప్రతినిధులు, బాధ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆయుధాల పనితీరుపై అవగాహన

భీమిని: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యార్థులకు ఆయుధాలపై ఎస్సై నరేశ్ అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది విధుల నిర్వహణ, పోలీసు విధులు, ఆయుధాల పనితీరు గురించి తెలియజేశారు. విద్యార్థుల సందేహాలను నివృత్తిచేశారు. ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మణ్, మహేష్ పాల్గొన్నారు.

క్షయ నివారణకు ప్రత్యేక కృషి

ఇచ్చోడ: ప్రభుత్వం క్షయ నివారణకు ప్రత్యేక కృషి చేస్తోందని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దేశ్‌ముఖ్‌నగర్‌లో 42 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి, వైద్య పరీక్షలు చేశారు. వ్యాధి సోకినవారు వెంటనే సంబంధిత ఆరోగ్య కేంద్రంలో సమాచారం ఇవ్వాలన్నారు. బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రాజుబాయి, హెల్త్ సూపర్ వైజర్లు కళావతి, ఉత్తంసింగ్, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కై లాస్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు లేక తిప్పలు

- జిల్లా కేంద్రంలో కానరాని పబ్లిక్ టాయిలెట్లు
- అవస్థలు పడుతున్న మహిళలు
- పట్టించుకోని అధికారులు



జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో ప్రజా మరుగుదొడ్లు లేక చిరు వ్యాపారులు, ఆయా దుకాణాల్లో పని చేసే సిబ్బంది, వివిధ పనులపై జిల్లాకేంద్రానికి వచ్చిన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛత పాటించాలని చెబుతున్న ప్రభుత్వాలు, అధికారులు జిల్లా కేంద్రంలో ఎక్కడా మూత్రశాలలు, పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఖాళీ స్థలాల వైపు పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. మహిళల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం ఏర్పడి 4 సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు ఒక్క పబ్లిక్ టాయిలెట్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

తప్పని తిప్పలు..

ఆసిఫాబాద్ కేంద్రం మండలం నుంచి జిల్లాగా మారడంతో ఏదో ఒక పనిపై నిత్యం వందలాది మంది ప్రజలు జిల్లా కేంద్రానికి వస్తుంటారు. కానీ ప్రజా మరుగుదొడ్లు నిర్మించక పోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలో వివేకానంద చౌక్, గాంధీ చౌక్, పొట్టి శ్రీరాం చౌక్, అంబేద్కర్ చౌక్‌లలో అనేక వ్యాపార సముదాయాలు, కిరాణాలు, రకరకాల దుకాణాలు కలిపి మొత్తం 400 వరకు ఉన్నాయి. ఆయా షాపుల్లో సుమారు 570 మంది వరకు పని చేస్తుంటారు. దానితో పాటు వివిధ పనుల నేపథ్యంలో తిర్యాణి, కెరమెరి, వాంకిడి, రెబ్బెన, జైనూర్‌తో పాటు వివిధ మండలాల నుంచి వేలాది మంది జిల్లా కేంద్రానికి వస్తుంటారు. కానీ వీరంతా ఒంటికి, రెంటికి తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. మగవాళ్లు తప్పని అత్యవసర పరిస్థితుల్లో ఖాళీ స్థలాల వైపు పరుగులు తీస్తున్నారు. స్త్రీలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకేంద్రంలో ఎక్కడ ఉన్న బస్ స్టేషన్‌లోని మురుగుదొడ్లకు పరుగు పెట్టాల్సిన దుస్థితి వారిది. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లల్లో మూత్రశాలలు ఏర్పాటు చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి



జిల్లా కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్లు లేక ఆయా షాపుల్లో పని చేసే సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కనీసం మూత్రశాలలు ఏర్పాటు చేయాలి.

– సత్తయ్య, ఐరన్ షాపు నిర్వాహకుడు

చాలా ఇబ్బందిగా ఉంది



పట్టణంలో పబ్లిక్ టాయిలెట్లు లేవు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో మూత్రశాలలు ఏర్పాటు చేయాలి. బస్ స్టేషన్‌లో తప్ప పట్టణంలో ఎక్కడా లేక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– బాలాజీ, మెస్సేవేర్

ప్రతిపాదనలు పంపించాం

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్, జూబ్లీ మార్కెట్ వద్ద రెండు పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం కోసం రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే నిర్మాణాలు చేపడుతాం.

– వంశీ, పంచాయతీ కార్యదర్శి

'బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలి'



పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం యువత కృషి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. నౌగాంబస్తీకి చెందిన బీజేపీ పార్టీ యువకులు శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆయా పార్టీలకు చెందిన వారు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గెలుస్తా.

చింతలమానెపల్లి: సిర్పూర్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గెలుస్తానని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. గురువారం మండలంలోని గూడెం గ్రామంలో నిర్వహించిన ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా గూడెం, దిందా, శివపెల్లి, కోయపెల్లి, గ్రామాలకు చెందిన పలువురు ఆయా పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేసిన ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కౌటాల: బీఆర్ఎస్‌తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని కనికి, కన్నెపల్లి, తాటిపల్లి, తలోడి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ అభివృద్ధి ఎమ్మెల్యే కోనేరు కోనప్పతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని తెలిపారు. పార్టీ అధినేత కేసీఆర్ విడుదల చేసిన మేనిఫెస్టోను పకడ్బందీగా అమలు చేస్తారని తెలిపారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ రమేశ్, మాజీ ఎంపీపీ గంగారం, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు ఆనంద్‌రావు, సంతోశ్, శ్రీనివాస్, రాంచందర్, అశోక్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ప్రచార హోరు



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు మర్థిడి, బారెగూడ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం గడపగడపకు వెళ్లి ప్రచారం చేపట్టారు. మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ముమ్మర ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను గ్రామస్తులకు పంపిణీ చేస్తూ అందులో ఉన్న విషయాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు లక్ష్మినారాయణ, అజీమ్ ఖాన్, దుపం శ్రీను, బిబ్బేరా రమేశ్, గోమాస నారాయణ, ఏనుక శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌటాలలో ప్రవీణ్‌కుమార్ పర్యటన

కౌటాల: బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తారని బీఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిడాం గణపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌటాల మండలంలోని శీర్షా, కనికి, తాటిపల్లి, మొగడ్‌దగడ్, గుడ్లబోరి, గురుడుపేట, బోదంపల్లి గ్రామాల్లో యాత్ర కొనసాగుతుందన్నారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. యాత్రను పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విశ్వప్రసాద్

నార్నూర్: బీఆర్ఎస్ మాయదారి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని కుమురం భీం డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ అన్నారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలో అజ్మీరా శ్యాంనాయక్‌తో కలిసి కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్కరికైనా డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు దండుకున్నారే తప్పా అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. కనీసం పోటీ పరీక్షలు నిర్వహించలేని దుస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. అధిష్టానం ఎవరికి బీఫాం ఇచ్చినా.. వారి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్య నిర్వహక అధ్యక్షుడు వసంత్‌రావు, జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు గుండా శ్యామ్, గెడం పరుశురాం, మారుతి, ముకిత్ భాయ్, అడే గణేశ్, సుద్దాల ఆనంద్, వామన్‌రావు పాల్గొన్నారు.

ప్రచారానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే సతీమణి

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప గెలుపు కోసం ఆయన సతీమణి కోనేరు రమాదేవి శుక్రవారం నుంచి ప్రచారం ప్రారంభించారు. సాయంత్రం స్థానికంగా పలు కాలనీల్లో ఆమె పర్యటించి సర్వమతాల మద్దతు కోరుతూ ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని ఓటర్లను కోరారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

జైపూర్: కడుపునొప్పి భరించలేక యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని టేకుమట్లలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. కాగజ్‌నగర్‌కు చెందిన స్వాతి(19) టేకుమట్లలోని వారి పెద్దమ్మ–పెద్దనాన్న అయిన తిరుమల–రాజమల్లు ఇంట్లో ఉండి చదువుకుంటుంది. గత కొంతకాలం కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో నొప్పి బాధ భరించలేక ఇంట్లోనే స్వాతి ఉరేసుకుంది. గమనించిన బంధువులు వెంటనే మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. స్వాతి తల్లిదండ్రులు కాగజ్‌నగర్ తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రాగా, ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

న్యాయం చేయాలని కోరుతూ యువతి ఆందోళన

కాగజ్‌నగర్‌టౌన్: నిశ్చితార్థం అయ్యాక పెళ్లికి నిరాకరించిన యువకుడి ఇంటి ఎదుట న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం రాత్రి ఓ యువతి ఆందోళన చేపట్టింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని సంజీవయ్య కాలనీకి చెందిన ప్రకాశ్‌కు ఆరు నెలల క్రితం ఆసిఫాబాద్ మండలం బురుగూడకు చెందిన శిరీషతో నిశ్చితార్థం జరిగింది. పెళ్లి జరగాల్సిన క్రమంలో పలు కారణాలతో వాయిదా పడింది. తాజాగా ప్రకాశ్ పెళ్లికి నిరాకరించడంతో శిరీష యువకుడి ఇంటికి వచ్చింది. దీంతో యువకుడి కుటుంబ సభ్యులు ఆమెను ఇంట్లో నుంచి బయటకు పంపించారు.

దీంతో తీవ్ర చలిలోనే ప్రకాశ్ ఇంటి ముందు యువతి ఆందోళనకు దిగింది. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్సై ఎంబడి శ్రీకాంత్ అక్కడకు చేరుకొని ఇరు పక్షాల నుంచి వివరాలు సేకరించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని, నచ్చజెప్పే ప్రయత్నం చేసినా యువతి వినకుండా ఆందోళన కొనసాగిస్తోంది.

'హామీలు నెరవేర్చని ప్రభుత్వ విప్'

మందమర్రిరూరల్: నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదని, అలాంటి బీఆర్ఎస్‌కు ఓటు అడిగే హక్కు లేదని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్ ఆరోపించారు. మందమర్రిలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని, మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించలేదన్నారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని, అర్హులకు దళితబంధు పథకాలు అందలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో స్థానికేతరుడైన బాల్క సుమన్‌ను ఓడించి స్థానికుడిని గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు రంజిత్, అఖిల్, రాజేందర్, రవీందర్, పవన్‌కుమార్, రవి, మారుతి, మనోహర్, వినయ్, రవితేజ, మధు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబరాలు



సంబరాలు జరుపుకొంటున్న అభిమానులు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి పట్టణంలోని రాజీవ్ చౌక్‌లో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు.

జోడేఘాట్‌లో ముమ్మరంగా పనులు



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న కార్మికులు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో నేడు నిర్వహించనున్న కుమురం భీం 83వ వర్ధంతి సందర్భంగా రెండు రోజుల నుంచి ముమ్మరంగా పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. సుమారు 100 మంది కార్మికులు చెత్తా చెదారం లేకుండా పారిశుధ్య పనులు చేస్తున్నారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఎంపీడీవో మహేందర్, ఈజీఎస్ ఏపీవో నగేశ్, ఈజీఎస్ టీఏ నాగోరావు, 31 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలన..

కెరమెరి: నేడు జోడేఘాట్‌లో నిర్వహించనున్న కుమురం భీం 83వ వర్ధంతి ఏర్పాట్లను శుక్రవారం కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ ఆత్రం బొజ్జిరావు, ఎంపీపీ పెందోర్ మోతిరాం పరిశీలించారు. కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భీం సమాధికి పూజలు చేశారు. నాయకులు భరత్ భూషణ్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఆడపడుచుల 'బులాయి'



బులాయి ఆడుతున్న మహిళలు (ఫైల్)

- నేటి నుంచి రెండు రోజులపాటు పండుగ
- మట్టితో చేసిన గౌరమ్మకు పూజలు
- పుట్టింటికి చేరుకున్న ఆడబిడ్డలు

దహెగాం: మహిళలకు అత్యంత ఇష్టమైన పండుగ బతుకమ్మ ముగిసిన తరువాత పౌర్ణమి రోజు మరో పండుగ 'ఐనం బులాయి'ని నియోజకవర్గంలో భక్తులు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. కొన్ని సంవత్సరాల క్రితం నుంచి ఐనం గ్రామంలో బులాయి పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఐనంలో పుట్టిన ఆడబిడ్డలు ఎక్కడ ఉన్న ఈ పండుగకు పుట్టిన ఊరికి చేరుకుంటారు.

నేడు గౌరమ్మను ప్రతిష్ఠించి..

బులాయి పండుగ సందర్భంగా నేడు శనివారం మట్టిని నియమనిష్టలతో తీసుకొచ్చి గౌరమ్మను చేసి బులాయి ఆడే ప్రదేశంలో పెట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం బులాయి ఆట ప్రారంభిస్తారు. పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డలకు కొత్త బట్టలు, కట్నాలు సమర్పిస్తారు. ఆదివారం సాయంత్రం నుంచి బులాయి సందడి గ్రామంలో నెలకొంటుంది. ఆదివారం సాయంత్రం నుంచి బులాయి ఆడుకొని సోమవారం ఉదయం వాగులో నిమజ్జనం చేస్తారు. బులాయి ఆట సందర్భంగా గ్రామంలో జాతర ఏర్పాటు చేస్తారు. కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, భీమిని, కన్నెపల్లి, కౌటాల మండలాల ప్రజలు భారీగా తరలివచ్చి బులాయి ఆట తిలకిస్తారు.

ఘనంగా కుమురంభీం వర్ధంతి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రెబ్బెన: మండలంలోని లేతన్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆదివాసుల ఆరాధ్య దైవం కుమురంభీం 83వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం రవికుమార్ మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప పోరాటయోధుడు కుమురం భీం అన్నారు. నేటి తరం విద్యార్థులు భీం పోరాటాల గురించి తప్పక తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ, ఎస్సై, పోలీసులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) అసెంబ్లీ ఎన్నికలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కౌటాల సీఐ సాధిక్‌పాశ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతకుంట, లోనవెల్లి తదితర గ్రామాల్లో మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు ఎన్నికల అధికారులకు, పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని, ఎలాంటి అల్లర్లకు తావు ఇవ్వకూడదన్నారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసులకు తక్షణమే సమాచారం అందించాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

రైతులకు అవగాహన



డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: భూసార పరీక్షల ఆవశ్యకత, వాతావరణ సంబంధిత సమాచార విస్తరణపై రైతులకు ఎక్స్‌టెన్షన్ ఎడ్యూకేషన్ ఇన్‌స్టిట్యూట్, ఎవర్ గ్రీన్ ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్ అధికారులు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని నజ్రూల్‌నగర్ గ్రామంలో శిక్షణ ఇచ్చారు. నాబార్డు వారి ఆర్థిక సహకారంతో నిర్వహించే ఫిజిటల్ సేవల ద్వారా రైతులకు లాభదాయకతను పెంపొందించే ప్రాజెక్టులో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు శాస్త్రవేత్తలతో చర్చించే సదుపాయం, వ్యవసాయంలో డ్రోన్ పద్ధతి వినియోగంపై అవగాహన, మార్కెటింగ్ విస్తరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు డాక్టర్ ఎం.జగన్, మోహన్ రెడ్డి, శిరీష, ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌రావు, ఏడీఏ కృష్ణారెడ్డి, ఏవో రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎక్సైజ్ దాడులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం మెరుపు దాడులు చేశారు. తాండూర్ మండలం రేచిని గ్రామంలో ముక్క నారాయణ వద్ద నాటుసారా పట్టుకున్నట్లు సీఐ దీపక్ తెలిపారు. పులిమడుగు, లింగాపూర్ గ్రామాల్లో దాడులు చేసి 900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు. కాసిపేట మండలం దేవాపూర్ గ్రామంలో పెద్ది హరీష్ వద్ద నుంచి అక్రమంగా అమ్ముతున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మద్దిమాడలో ఎల్లక్క వద్ద నుంచి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గ్యార్వి జెండా పండుగ

తాండూర్: మండలంలో గ్యార్వి జెండా పండుగను ఘనంగా జరుపుకున్నారు. జామా మసీద్ ఇమామ్ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో ముస్లింలు జెండాలతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గౌస్‌పాక్ దర్గా వద్ద, తంగళ్లపల్లి మసీదు వద్ద శుక్రవారం అన్నదానం నిర్వహించారు.